క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో పాఠశాల విద్యార్థి కె.అశ్వసాయి ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, పీడీ ఎండీ. నసీరుద్దీన్, ఉపాధ్యాయులు మంగళవారం విద్యార్థిని అభినందించారు.

ఆలయంలో చోరీ

నెల్లికుదురు: హనుమాన్ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు వెండి కిరీటం అపహరించిన ఘటన మండలంలోని హేమ్లా తండా గ్రామ శివారు బోడ్యా తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని హేమ్లా తండా శివారు బోడ్యా తండాలో ఇటీవలే నూతనంగా హనుమాన్ ఆలయం నిర్మించి ప్రారంభించారు. ఆంజనేయ స్వామి విగ్రహానికి 500 గ్రాముల వెండి కిరీటాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వెండి కిరీటాన్ని ఎత్తుకెళ్లారు. మంగళవారం పూజారి వచ్చి చూడగా కిరీటం కన్పించలేదు. దీంతో తండావాసులకు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్అర్బన్: జిల్లాలో అర్హులైన ఎంబీసీ నిరుద్యోగ యువతకు టీజీఎంబీసీడీసీ ఆధ్వర్యంలో స్కిల్ కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, మెంటల్ వెల్నెస్ ట్రైనింగ్‌లో నాలుగు రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నర్సింహస్వామి మంగళవారం తెలిపారు. 21 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, ఏదైనా డిగ్రీ చదివినవారు అర్హులని తెలిపారు. ఈ నెల 12 వరకు టీజీఓబీఎంఎంఎస్.సీజీజీ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసి, దరఖాస్తు పత్రాలు ఇతర ధ్రువీకరణ పత్రాలు ఈ నెల 14 వరకు జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

మాటేడులో వనభోజనాలు



తొర్రూరు రూరల్: వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో కొంత ఉపశమనం పొందారు. దీంతో మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన రైతులు ముత్యాలమ్మ తల్లి, తమ కుల దేవతలకు మొక్కులు చెల్లించి కుటుంబ సమేతంగా గ్రామ శివారులోని చెట్ల కిందకి వనభోజనాలకు వెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు: ప్రస్తుతం సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యులు శారద, చైతన్య.. ఆశాలు, ఏఎన్‌ఎంలకు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. అనంతరం టీబీ నిర్ధారన క్యాంపు నిర్వహించినట్లు వారు తెలిపారు. జీయో టీబీ సూపర్‌వైజర్ సాయి కృష్ణ, హెల్త్ అసిస్టెంట్ వీరన్న, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యువాత



తొర్రూరు రూరల్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని వెలికట్ట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఎద్దు బాలయ్యకు చెందిన గొర్రెల మందను రోజువారీగా మేతకు తీసుకెళ్లగా గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌కు తాకడంతో షాక్‌కు గురై మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో సుమారు రూ.40 వేల నష్టంవాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

బొడ్రాయితండాలో పాడిగేదె..

దోర్నకల్: బొడ్రాయితండాకు చెందిన తేజావత్ శంకర్‌కు చెందిన పాడిగేదె.. తండా సమీపంలో మేతకు వెళ్లగా రాత్రి వీచిన గాలులతో తెగిపడిన విద్యుత్ తీగ తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని లక్ష్మణ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని వెటర్నరీ, విద్యుత్ శాఖ సిబ్బంది పరిశీలించారు.

అమీర్యాతండాల్లో కోడె..

నర్సింహులపేట: మండలంలోని అమీర్యాతండాలో బానోతు బాషాకు చెందిన కోడె దూడ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మంగళవారం ఉదయం మేతకు వెళ్లిన కొడె వ్యవసాయ బావి వద్ద కిందకు వేలాడిన విద్యుత్ తీగ తగిలి మృతి చెందింది. సుమారు రూ.30 వేలకు నష్టం జరిగిందని, అధికారులు పరిహారం అందించాలని రైతు విజ్ఞప్తి చేశాడు.

కంప్యూటర్ విద్య కలేనా..?

- మూలనపడిన కంప్యూటర్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు

కురవి: ప్రభుత్వ ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూల్‌లో అనేక సంవత్సరాల క్రితం ప్రభుత్వం మంజూరి చేసిన కంప్యూటర్లు నిరుపయోగంగా మారి మూలనపడ్డాయి. కొన్నేళ్ల క్రితం కంప్యూటర్ ఎయిడ్ లెర్నింగ్ కార్యక్రమం కింద విద్యుత్ సౌకర్యం ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూల్స్‌కు కంప్యూటర్లు అందించారు. కంప్యూటర్ ద్వారా విద్యార్థులకు ప్రాథమికంగా కంప్యూటర్ జ్ఞానాన్ని అందించేందుకు వాటిని ఉపయోగించేందుకు అందించారు. అయితే కొన్నేళ్ల పాటు పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్ నేర్పించారు. అనంతరం వినియోగించకపోవడంతో అవి కాలక్రమేనా పనికి రాకుండా పోయాయి. వాటిని రిపేరు చేసి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో సూదనపల్లి యూపీఎస్, కురవి మండలంలోని జెడ్పీ హైస్కూల్స్‌లో కంప్యూటర్లు పాడైపోయాయి. ఇప్పుడు రిపేరు చేసినా.. పనికి వచ్చే అవకాశాలు కనిపించడంలేదు. ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేసిన కంప్యూటర్లను పరిశీలించి నూతన కంప్యూటర్లను ఆయా పాఠశాలలకు అందించి, సాంకేతిక విద్యను విద్యార్థులకు అందించాలని వారి తల్లిదండ్రులు, విద్యావంతులు కోరుతున్నారు. ఈ దిశగా విద్యాశాఖ, ప్రజాప్రతినిధులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

కంప్యూటర్ విద్యనందించాలి..



ప్రభుత్వ పాఠశాలల్లో మూలనపడిన కంప్యూటర్లను బాగు చేయించి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలి. నేటి ప్రపంచంలో కంప్యూటర్ విద్య విద్యార్థులకు ఎంతో ప్రధానమైంది. అధికారులు స్పందించి కంప్యూటర్లను బాగు చేయించాలి.

– సాయికుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు

బీటీ-3 పత్తి విత్తనాలను నియంత్రించాలి



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మరిపెడ రూరల్: మండలంలో జోరుగా విక్రయాలు జరుగుతున్న ప్రభుత్వ నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలను నియంత్రించాలని సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. మరిపెడ వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్‌ను మంగళవారం కలిసిన సీపీఐ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ వ్యవసాయ సీజన్ పనులు ప్రారంభమైనందున మండలంలోని అమాకులపై రైతులను ఆసరగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ నుంచి తెచ్చిని బీటీ-3 పత్తి విత్తనాలు అంటగడుతున్నారని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న ఫెర్టిలైజర్, పెస్టిసైడ్ షాపులను నియంత్రించడంతో పాటు లైసెన్స్ రెన్యువల్ చేయని షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని బయో మందులను విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండీ అబ్దుల్ రషీద్, యాకన్న, సత్యం, రాజేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



గిరిపురంలో వీధులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

మరిపెడ రూరల్: మరిపెడ మండలంలోని వెంకట్ తండా, మూలమర్రితండా, బావోజిగూడెం, బోట్యతండా, గాలివారిగూడెం, ఎడ్జెర్ల తదితర గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు దరి చేరకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులు మంగళవారం ముమ్మరంగా చేపట్టారు. ఎంపీడీఓ విజయ, ఎంపీఓ సోంలాల్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను జీపీ సిబ్బంది ద్వారా చేయించారు. మండలంలోని వెంకట్‌తండాలో నీటి సరఫరా పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేశారు. మూలమర్రితండా, బాల్నిధర్మారంలో వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. మూలమర్రితండాలో వెలగని విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టారు. గాలివారిగూడెం, బుర్హాన్‌పురం, ఎడ్జెర్ల గ్రామాల్లో పిచ్చి మొక్కలు తొలగించి వీధులను శుభ్రం చేశారు. వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని రక్షిత మంచినీటి బావిలోని చెత్త, చెదారంతో పాటు పాకురును జీపీ సిబ్బంది మంగళవారం తొలగించారు.

సమ్మె నోటీసు అందజేత



మహబూబాబాద్: కమిషనర్ రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



గార్ల: నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ మండల కన్వీనర్, ఆశ వర్కర్లు

మహబూబాబాద్/ నెహ్రూసెంటర్/గార్ల/బయ్యారం/తొర్రూరు: జూలై 9వ తేదీన జరగనున్న కార్మికుల దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ రజిని అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ మౌనికకు , ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ మానుకోట మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు, సీఐటీయూ గార్ల మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్‌కు వేర్వేరుగా మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు. బయ్యారం బయ్యారంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సంఘాలు, యూనియన్ల బాధ్యులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. టీయూసీఐ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి, ఓమ భిక్షపతి తొర్రూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

చదువంటే ఇష్టంలేక..

- ఏకలవ్య మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థుల పరార్

కురవి: చదువంటే ఇష్టంలేక ఇద్దరు విద్యార్థులు పాఠశాల గోడదూకి పరారైన సంఘటన కురవి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. గుండ్రాతిమడుగు (విలేజి) శివారు పెద్ద తండాకు చెందిన గుగులోత్ ప్రసాద్ కుమారుడు రామ్, సీరోలు మండలం తాళ్ల సంకీస శివారు వస్రాం తండాకు చెందిన బానోత్ నరేందర్ కుమారుడు తానీష్.. కురవిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో టెన్త్ చదువుతున్నారు. చదువుపై ఇష్టం లేకపోవడంతో ఇద్దరు విద్యార్థులు పాఠశాల గోడదూకి పారిపోయారు. మానుకోటలో రైలు ఎక్కి సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. అనుమానాస్పదంగా స్టేషన్ ఎదుట తిరుగుతున్న ఇద్దరు బాలురను అక్కడి రైల్వే పోలీసులు విచారించి, సమాచారం ఇవ్వడంతో కురవి పోలీస్ సిబ్బందిని అక్కడికి పంపించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పారిపోయిన విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయడంతో 30 నిమిషాల్లోనే సికింద్రాబాద్ రైల్వే పోలీసుల నుంచి సమాచారం అందినట్లు తెలిపారు.

సమాజ సేవకు చేయూతనిద్దాం



వీల్‌చైర్‌ను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

పెద్దవంగర: సమాజ సేవకు చేయూత నిద్దామని లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ దామెర సరేష్ పేర్కొన్నారు. బొమ్మకల్లు ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవాతరుణి మండల అధ్యక్షురాలు తుమ్మూరి శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నోట్‌బుక్స్, జ్యూట్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. గ్రామంలోని ఓ దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేశారు. జోన్ చైర్ పర్సన్ దీప, లయన్ డాక్టర్ నాగవాణి, రాజసుకన్య, శైలజ, పద్మ, ఉమ పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న హెచ్‌ఎం

మరిపెడ రూరల్: బావోజిగూడెం యూపీఎస్ పాఠశాల హెచ్‌ఎం గుగులోతు మంగునాయక్ ఔదార్యం చాటుకున్నాడు. తాను పని చేస్తున్న పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో నోట్ పుస్తకాలు, పెన్సిల్స్ మంగళవారం అందజేశారు. మంగునాయక్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పీరీల ఊరేగింపు



చిన్ననాగారంలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

నెల్లికుదురు: మొహర్రం పండుగను పురస్కరించుకుని ముస్లింలు మండలంలోని వివిధ గ్రామాల్లో పీరీలను ఊరేగిస్తున్నారు. మంగళవారం పలు గ్రామాల్లో ఇంటింటికీ పీరీలను తీసుకెళ్లారు.

కేసముద్రంలో బంద్ ప్రశాంతం



కేసముద్రంలో నిరసనలో పాల్గొన్న దుకాణదారులు, ప్రజలు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 100 ఫీట్ల వెడల్పు కాకుండా, 60 ఫీట్ల వరకే రోడ్డును ఏర్పాటు చేయాలంటూ మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో పలువురు దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేసముద్రంవిలేజ్, కేసముద్రం స్టేషన్‌కి చెందిన పలువురు బాధితులు కేసముద్రం విలేజ్ నుంచి జ్యోతిరావుపూలే సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో తాము ఇళ్లను, దుకాణాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన చెందారు. నా 100 ఫీట్ల రోడ్డు కాకుండా, 60 ఫీట్ల వరకే రోడ్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్, శ్రీను, సతీష్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, జావిద్, శ్రీపాల్‌రెడ్డి, కొత్తకొండ యాదగిరి, సందీప్, సతీష్, వేణు, రవి పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ గ్రాఫ్ పడిపోయింది

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాసరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గార్ల: దేశంలో బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని, పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ సీట్లు రాక పోయినా కొన్ని పార్టీల మనుగడతో పాలన కొనసాగిస్తుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ పార్టీ ఎంతోకాలం అధికారంలో ఉండదన్నారు. సెక్యులర్ పార్టీగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ బీజేపీని ఎదురించి పోరాడుతుందన్నారు. ఈనెల 5, 6 తేదీల్లో కురవిలో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి వెంకన్న, రమేష్, జనార్దన్, వీరన్న, వెంకన్న, పిచ్చయ్య పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి

కురవి: ఫాసిస్ట్ బీజేపీ పాలనకు వ్యతిరేకంగా సీపీఐ శ్రేణులు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 5, 6 తేదీల్లో సీపీఐ జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు ఇంటింటికి కరపత్రాలతో మంగళవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, బస్వ కొమురయ్య పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి పోరాడుతాం

నెల్లికుదురు: నిరుపేదల అభ్యున్నతి, జిల్లా అభివృద్ధికి సీపీఐ పోరాడుతోందని పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5, 6న కురవి మండల కేంద్రంలో జరిగే జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లక్ష్మి, సత్యనారాయణ, అజయ్ సారథిరెడ్డి, సోమయ్య, వెంకన్న, స్వామి, వెంకట్‌రెడ్డి, ఉమ, నాగన్న, పద్మ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాం సుధీర్

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించాలని బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ శ్రీరాం సుధీర్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు కోరారు. మంగళవారం మండలంలోని మాటేడు గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేవిధంగా కలసికట్టుగా పని చేసి స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, ప్రమోద్‌గౌడ్, కాలునాయక్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ వైద్యులను గౌరవించుకోవాలి

ఆపద కాలంలో.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యం అందించి కాపాడే డాక్టర్లను ప్రతిఒక్కరూ గౌరవించాలని పలువురు అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా వివిధ సంస్థల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. వైద్యులు సిబ్బందిని ఈసందర్భంగా సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



నెహ్రూసెంటర్: వైద్యులను సన్మానిస్తున్న మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుచిత్రబాలునాయక్



తొర్రూరు: తొర్రూరులో సన్మానం పొందిన వైద్యులతో సేవా తరుణి ప్రతినిధులు



గూడూరులో సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ



గార్ల సీహెచ్‌సీలో..



దంతాలపల్లిలో..

విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్ : ముడుపుగల్ గ్రామంలో ఈ నెల 4వ తేదీన జరుగనున్న సీపీఐ 16వ మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మండలంలోని హాజారియా తండ సీపీఐ గ్రామ శాఖ మహాసభ మంగళవారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. సీపీఐ పేదల పక్షాన అలుపెరగని ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కొమ్ము నారాయణ, వీరన్న, రాములు, చక్రు, గోవ్య, శ్రీను, వస్తం, శంకర్, లక్ష్మ, బావుసింగ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు, నంబర్లు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇంటి పట్టాలు, నంబర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి కోరారు. పట్టణంలోని సీపీఐ శాఖల మహాసభలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. నేడు జిల్లా కేంద్రంలో జరగనున్న సీపీఐ పట్టణ 14వ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెరుగు కుమార్, నవీన్, శ్రావణ్, అశోక్, వివేక్, ఐలయ్య, అన్వర్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

బయ్యారం: బయ్యారం ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా పుసులూరి మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా మండ రవి, ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, బి.వీరన్న, సర్దార్, రంగయ్య, సహాయ కార్యదర్శులుగా వై.శ్రీను, కె.వీరన్న, రంజిత్, కోశాధికారిగా పి.శ్రీను, గౌరవ అధ్యక్షులుగా నాగభూషణం, శివరాం, మధు, వీరభద్రంను ఎన్నుకున్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బీచ్‌రాజ్‌పల్లి శివారు ఆకేరు వాగు నుంచి కూపన్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు మరిపెడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ కూపన్ ద్వారా మాత్రమే ఇసుక రవాణా చేయడానికి అనుమతినిచ్చినట్లు పేర్కొన్నారు. కూపన్ లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

నర్సింహులపేట: ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని ఆయిల్ పామ్ తోటలను వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. పంట మార్పిడితో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఎస్సీ,ఎస్టీ రైతులకు 100 శాతం, ఇతరులకు 90 శాతంలో సబ్సిడీతో డ్రిప్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు రైతు వేదికలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

5న పూరీ జగన్నాథుడి రథయాత్ర

గార్ల: గార్ల పట్టణంలో ఈనెల 5న పూరీ జగన్నాథుడి రథయాత్రను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రథయాత్ర విజయవంతం చేయాలని కోరుతూ భక్తులు మంగళవారం కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వ్యాపారస్తులు తమ దుకాణాలను మూసివేసి రథయాత్రలో పాల్గొనాలని కోరారు. సత్యనారాయణ, విజయలక్ష్మి, హైమావతి, శ్రీనివాస్, మణికంఠ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: హైదరాబాద్‌లో జరిగిన కెమికల్ ఫ్యాక్టరీ ఘటనలో మృతి చెందిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

మరిపెడ రూరల్: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించుకోవాలని మరిపెడ ఎంపీఓ సోంలాల్ అన్నారు. మరిపెడ మండలం బోట్యతండా, వెంకట్‌తండా గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఎంపీఓ సోంలాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీల్లోని మొక్కలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున ఆయా గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించన్నట్లు తెలిపారు. అందుకు దగ్గట్టుగా నర్సరీల్లో మొక్కలు కలిగి ఉండాలని సూచించారు. అందుకు ఎవరైన నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గిరిజనులంతా ఏకతాటిపై నడవాలి



జెండాను ఆవిష్కరిస్తున్న నెహ్రూనాయక్

నెల్లికుదురు: సమస్యల పరిష్కారానికి గిరిజనులంతా ఏకతాటిపై నడువాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు భూక్య నెహ్రూనాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు జాటోతు వీరన్న నాయక్, శంకర్ నాయక్, నారాయణ నాయక్, బీముడు నాయక్, సత్యపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బాలాజీ నాయక్, దేవేందర్‌రెడ్డి, సుందర్ నాయక్, సతీష్ పాల్గొన్నారు.